# జోస్యం

శ్యామలరావు ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

అప్పెక్కడ పుట్టించాలా అన్న ఆలోచన అతని మనసును కొరికేస్తోంది నాలుగువైపులా చూస్తూ నడుస్తున్నాడు— రోడ్డంట ఎవరన్నా తెల్సినవాడూ తనకు అప్పు యివ్వదగ్గవాడూ కన్పిస్తాడేమోనని, మార్కెట్టు దగ్గరకు వచ్చే సరికి సుబ్బారావు కన్పించాడు కూరల సంచితో

"వీడి మొహం ! వీడి దగ్గరుండేదెంతో వీడి సంచీయే చెబుతోంది'' అనుకున్నాడు సగంకూడ నిండని సుబ్బారావు సంచీవైపు చూసి

ఇకిలింపులాంటి నవ్వోటీ అతని మొహాన పారేసి, అర్జంటుగా కదిలిపోయి నాలుగడుగులువేసి ఫుట్‌పాత్ ఎక్కి నిల్చుని జేబులోంచి నలిగి పోయిన ఆఖరి చార్మినార్‌ని తీసి వెలిగించాడు,

ఎండ తీక్షణంగా వుంది.

ఆదివారం పూట మోర్నింగ్ షోకి పోతే సుఖం

జేబుల్లోని డబ్బుల్ని తడిమి చూసుకున్నాడు. ఇరవై అయిదు పైసల బిళ్ళా, రెండు తేలికైన పదిపైసల బిళ్ళలూ.

"రండి బాబూ రండి. పదిపైసలకే మీ అదృష్టం తెల్సుకోండి"

అరుస్తున్నాడు ఆంజనేయస్వామి చెట్టుకింద చిలకల జోస్యగాడు.జీవితంలో ముందు జరగబోయే సంఘటనలు కేవలం పదిపైసలకే అంటే చవక్కాదూ?

జనం గుమిగూడారు అతగాడి ముందు—కణాలమీద అతగాడి ఆర్జన రూపాయి దాటడం శ్యామలారావు చూస్తూనే వున్నాడు

"తనకంటే వాడే నయం!" అనుకున్నాడుకూడ.

"లాటరీలు రాకపోతే పోయే యీపాడు గుమస్తా వుద్యోదం మారి తనకెప్పుడన్నా మంచి వుద్యోగం వస్తుందేమో కనుక్కుంటేనో, అనే ఆలోచన శ్యామలారావులో జొరబడింది.

అంతలోనే అతనిలోని మనసు ఒక్క గసురు గసిరింది—

"చిలక జోస్యం నమ్ముతావా? నీకేం బుద్ధిలేదూ?" అని

బుద్ధికి కోపమొచ్చి నేనే లేకపోతే వీడీపాటి వుండేవాడు కాదు అంది—ఆ దెబ్బతో శ్యామలారావు ఆ వుద్దేశాన్ని మార్చేసుకుని దగ్గరున్న హోటల్లోకి దూరాడు.

అక్కడకూడ తెలిసున్న ముఖం ఒక్కటీ కన్పించలేదు.

మూలగా ఖాళీగావున్న బల్లదగ్గరకు పోయి కూర్చుని డబుల్ స్ట్రాంగ్ టీకి ఆర్డరిచ్చి ఆలోచలో పడ్డాడు.

కూటికి లేని బ్రతుకు కాకపోవచ్చు కానీ యిబ్బందులులేని బ్రతుకు మాత్రంకాదు తనది — నాలుగో తారీఖు నుండీ డబ్బుకోసం తాపత్రయపడ్డం—మళ్ళీ ఫస్టుకోసం ఎదురుచూడ్డం. కిరసనాయిల్ ఎప్పుడు నిండుకుంటుందో, చంటాడి పాలడబ్బా ఎప్పుడైపోతుందో, రేషన్ ఎప్పుడొస్తుందో—

ఇవే ఆలోచలు నెలల్లా—

సర్వర్ టీ తెచ్చాడు. నెమ్మదిగా సిప్‌చేస్తూ ఎదురుగా చూశాడు. ఎప్పుడొచ్చి కూర్చున్నాడో ఎదురుగా ఓ వ్యక్తి కూర్చున్నాడు. సన్నగా ఎర్రగా ఎర్రబడ్డ జుట్టుతో ఆంగ్లోఇండియన్‌లా వున్నాడు.

అతగాడు శ్యామలారావువైపు చూసి స్మాల్ సైజు నవ్వోటి నవ్వాడు. శ్యామలారావుకేం అర్థంకాలేదు. అటువంటి వ్యక్తి నెపుడూ చూసినట్టు గుర్తులేదు. పరిచయం లేకపోయినా వున్నట్టు నవ్వితే ఆశ్చర్యమనిపించదూ?

“మీ చెయ్యి ఒకసారి చూడనిస్తారా?” అన్నాడతడు అప్పటివరకూ ఒళ్ళోపెట్టుకున్న బ్రీఫ్‌కేసును టేబిల్ మీదుంచుతూ—

శ్యామలారావు కర్థమైంది. సగం తాగిన కప్పును టేబిల్ మీదుంచి చేయి చాచాడు.

ఓ అరక్షణం చూసి “మీది చాల పిక్యూలియర్ అండ్ కాంప్లికేటెడ్ హేండ్” అని నవ్వి వూరుకున్నాడు,

చెయ్యి వెనక్కు తీసేసుకుని టీ తాగుతూన్నా శ్యామలారావులో ఆత్రుత చావలేదు.

సర్వర్ అతగాడికీ టీ తెచ్చియిచ్చాడు. రెండు గుక్కల్లో టీ తాగి పెట్టేసి సిగరెట్ వెలిగించుకుని, డైరీ తీసి చూసుకుంటున్నాడతను.

ఇతనెవరో చూస్తుంటే జాతకాలవాడిలా వున్నాడు. లేకపోతే తన చెయ్యెందుకు చూస్తాడు? ఎంత అణచుకోవాలనుకున్నా శ్యామలారావు తనలోని ఆత్రుతను అణుకుకోలేకపోయాడు.

“మీరింతకీ నా చెయ్యెందుకు చూశారో చెప్పారు కాదు” అన్నాడు— అతగాడు డైరీ మూసేసి ఒక్క చిరునవ్వు నవ్వి,

“నా వృత్తే అది. కానీ ఎందుకో మీ చెయ్యి కొత్తగా అన్పించి చూడా

లనిపించింది 'వెరీ నైస్ హేండ్'' అన్నాడు తొణక్కుండా.

"యేముంది నా చేతిలో?'' ఈ అవకాశాన్ని శ్యామలారావు జారవిడుచుకోదల్చుకోలేదు.

అంతకుముందు నవ్విన నవ్వులాంటిదే నవ్వి, జేబులోనుండి తన ఎడ్రసుకార్డు తీసి శ్యామలారావు చేతికిస్తూ—

"మీకు జాతకాలమీద నమ్మకముంటే సాయంత్రం ఐదుగంటలకు యీ ఎడ్రసుకు రండి — మీ లైఫ్ స్కెచ్ రాసిస్తాను'' అని బ్రీఫ్ కేసందుకుని లేచాడు.

"ఎంత చార్జి చేస్తారు?'' సంశయిస్తూనే అడిగాడు

"ఆ విషయం మీ కనవసరం — మీరు రండి'' అని నవ్వుతూనే వెళ్ళిపోయాడు.

"విచిత్రంగా వున్నాడే'' అనుకుంటూ తన చేతిలోని అతనిచ్చిన విజిటింగ్ కార్డువంక చూశాడు. బి. విలియమ్స్. పామిస్ట్. అన్న అచ్చు అక్షరాల క్రింద పెన్నుతో రాసిన హోటల్ ఎడ్రసు వుంది. రెండోవైపు పర్మనెంట్ ఎడ్రసు ప్రింటుచేసి వుంది.

సాయంత్రంవరకూ చాల ఆలోచించాడు శ్యామలారావు వెళ్ళాలా వద్దా అని. మధ్యాహ్నం ఓ పని అప్పుకూడ పుట్టడంవల్ల ఓ అయిదు జేబులో వేసుకుని వెళ్తేపోలా' అనుకున్నాడు.

హోటల్ రూంలోకి వెళ్ళగానే విలియమ్స్ తనకోసమే ఎదురుచూస్తున్నట్లనిపించింది శ్యామలారావుకి. పలకరించి కుర్చీ చూపించాడు.

శ్యామలారావుకి మాటలెలా ప్రారంభించాలో అర్థంకాలేదు. విలియమ్సే

అన్నాడు. "నాకిప్పుడు అర్జంటు ఎంగేజ్‌మెంట్ తగిలింది—కానీ మీ రాస్తారనే కూర్చున్నాను" అని. ఓ ఆల్బమ్ తీసి శ్యామలా్రివు చేతికందించాడు. అందులో పెద్ద పెద్దవారు విలియమ్స్ జ్యోతిష్కానికి మెచ్చి యిచ్చిన కాంప్లిమెంట్సూ, సర్టిఫికేట్లూ, కొందరి మంత్రుల ఎన్నికల విషయంలో విలియమ్స్ చేసిన సవాళ్లు తాలూకా పేపర్ కటింగ్సు చాలా వున్నాయి.

ఇతనింత ఘనుడా అన్పించింది శ్యామలా్రివుకి. పైగా అతనిచే తన ఫ్యూచర్ చెప్పించుకోవాలన్న కోరిక కూడ పెరిగింది—శ్యామలా్రివుకి జాతకాలపై నమ్మకం కుదిరేందుకేమో విలియమ్స్ మరికొన్ని విదేశ పుస్తకాలను, తన జ్యోతిష విజ్ఞానాన్నీ ప్రదర్శించాడు

తనతో మాట్లాడుతూనే నాలుగైదుసార్లు చేతి వాచీ చూసుకోవడం శ్యామలా్రివు గమనించకపోలేదు. అందుకే తను వెళ్ళిపోడానికి తొందరపడి "యింతకీ నా గురించి చెబితే వెళ్ళిపోతాను" అన్నాడు.

విలియమ్స్ నవ్వి. "మీకు లైఫ్ స్కెచ్ వేసివ్వాలనే పిలిపించాను—" అని, ఓ తెల్లకాగితం. స్టాంపింగ్ వేస్తూతీశాడు.

"మీరెంత చార్జి చేస్తున్నారో చెప్పారు కాదు" అన్నాడు శ్యామలా్రివు భయంగానే—అల్బమ్ చూసిన దగ్గర నుండీ అతనికి నమ్మకం యేర్పడ్డమే కాకుండా తక్కువ చార్జి చేసే రకంకాదని తేల్చుకున్నాడు.

"అందరి దగ్గరా పాతికకు తక్కువ పుచ్చుకోను—కానీ మీకు ఫ్రీగానే రాసిస్తా. ఒక్క షరతుమీద".

"యేమిటో అది?" అనుమానంగా చూశాడు శ్యామలా్రావు.

"యేంలేదు— నా ధ్యేయమంతా జాతకంమీద నమ్మకం లేనివారికి నమ్మకాన్ని కలుగజేయడమే. ఆ వుద్దేశంతోనే వూరూరా తిరుగుతున్నాను— నాకీ వూరు కొత్త —కాబట్టి మీ ఫ్రెండ్స్‌లో కొందరిని నావద్దకు పంపాలి."

తనకెందుకు ఫ్రీగా చేసిస్తానన్నాడో అప్పటికిగాని అర్థంకాలేదు శ్యామలారావుకి—అయినా అదెంతపని అనుకుని, అందుకు ఒప్పుకుని చేతి ముద్ర యిచ్చి బైటపడ్డాడు.

వారంరోజుల్లో పూర్తి వివరాల జాతకం తేదీల నెలలతోసహా ఎప్పుడేం జరగబోతోందో రాసి యిచ్చాడు విలియమ్స్—

రెండుసంవత్సరాలలో వుద్యోగంలో మార్పు.నీ మరోయేడాదిలో మరికొన్ని శుభసూచకాలను చెప్పడంతో విలియమ్స్‌పై శ్యామలారావుకి నమ్మకమే కాకుండా గౌరవంకూడ పెరిగింది.

అనుకున్న ప్రకారం శ్యామలావు ఓ పదిమందికిపైనే విలియమ్స్ దగ్గరకు పంపటంవల్ల విలియమ్స్ బిజినెస్ పెరిగింది.

రెండు సంవత్సరాలు గడిచిపోయాయ-ఉద్యోగంలో తనకు తప్పకమార్పు వస్తుందని విలియమ్స్ రాసిచ్చిన గడువు దాటిపోడంతో శ్యామలావుకి అపనమ్మక మేర్పడింది—మూడో సంవత్సరంలో జరగవలసిన శుభకార్యాలు కూడ జరక్కపోయేసరికి శ్యామలావుకి నిజంగా విలియమ్స్‌మీద కోపమొచ్చింది—ఇంకా తను అందర్లాగూ మోసపోలేదు నయం—అనుకున్నా పూర్తిగా సంతృప్తిపడలేక విజిటింగ్‌కార్డు వెదికి తీసి విలియమ్స్ పర్మనెంట్ అడ్రెసుకు ఓ ఉత్తరం ఘాటుగా రాసి పారేశాడు...జాతకాలమీద నమ్మకం కుదిరేలా చేసేవాడు చేయవలసిన పని యిది కాదంటూ—

వారంరోజులు తిరక్కుండా శ్యామలారావు పేర ఉత్తరమొచ్చింది—అది విలియమ్స్ రాసినది కాదు—అయినా ఆశ్చర్యంతో విప్పి చదివాడు.

శ్యామలారావుగారికి—

మీ ఉత్తరం నన్ను చాల ఆశ్చర్యపరచింది—ఎందుకంటే మా నాన్నగారు ఔరియిన్ ఏక్సిడెంటులో పోయి నాలుగు సంవత్సరాలైంది. కనుక

మూడు సంవత్సరాల క్రితం మీకు జాతకం వ్రాసిచ్చినది మా తండ్రిగారు కాదని చెప్పడానికి సాహసిస్తున్నాను.

మరొక్క సంగతి—మా తండ్రిగారు ప్రముఖ పామిస్టు—యేక్సిడెంట్‌లో పోయిన ఆయన బ్రీఫ్‌కేసు యిప్పటికీ దొరక్కపోవటంవలన ఓ అనుమానం కూడ కలుగుతూంది. ఎవరో ఆయన పేరును, ఆయన కీర్తినీ ఉపయోగించుకుని మిమ్మల్ని మోసంచేసి వుండవచ్చునని— అతని వివరాలేమైనా తెలిస్తే చెప్పవలసింది—మీకు కలిగిన అసంతృప్తికి నేనూ విచారిస్తున్నాను—

—రాబర్ట్,

ఉత్తరం పూర్తి చేసిన శ్యాముప్రావు ఓ గంటవరకూ మామూలు మనిషవలేదు.

(మే 1976—యువ)